క్లుప్తంగా

కోటపల్లిలో కిసాన్ మేళా



మాట్లాడుతున్న డైరెక్టర్ వీకే.సింగ్

కోటపల్లి: మండల కేంద్రంలో కేంద్రీయ మెట్ట పరిశోధనాసంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో కిసాన్ మేళా నిర్వహించారు. రైతులకు వ్యవసాయ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ డైరెక్టర్ వీకే.సింగ్, ఎస్సీ సబ్‌ప్లాన్ నోడల్ ఆఫీసర్ టీవీ.ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఎస్సీ సబ్‌ప్లాన్‌తో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను ఎంపిక చేసి రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, టార్పాలిన్లు, పొటాష్ ఉచితంగా అందించారు. వ్యవసాయంలో నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు సుమారు 4 వేల మంది రైతులకు వ్యవసాయంపై శిక్షణ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీవో సిన్హా, చెన్నూర్ ఏడీఏ ప్రసాద్, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్, డాక్టర్ శ్రీదేవి శంకర్, డాక్టర్ ఆశిష్, డాక్టర్ అన్షిదా, డాక్టర్ నిషాకుమారి, డాక్టర్ జాగృతి, మండల కోఆర్డినేటర్స్ సంపత్, సునీల్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'మున్సిపల్‌లో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పక్కన కలెక్టర్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం చైర్‌పర్సన్ జె.శ్వేత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ కుమార్‌దీపక్‌తోపాటు ఎమ్మెల్యే జి.వినోద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ సభ్యులు బెల్లంపల్లి పట్టణానికి సంబంధించిన పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌కు బీఆర్ అంబేద్కర్, మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్, మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి పేర్లు ప్రతిపాదనలు రాగా మార్కెట్‌కు వెంకటస్వామి పేరు పెట్టాలని తీర్మానం చేశారు. ఆయా అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



హాజరైన విద్యార్థులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ చైతన్య హైస్కూల్‌కు చెందిన 2001–02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల మధ్య చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. వాట్సాప్ వేదికగా నాలుగు నెలల నుంచి ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పాఠాలు బోధించిన అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు.

వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం



కొమ్మెరలో బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఈ

చెన్నూర్‌రూరల్: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రావణ్ అన్నారు. మండలంలోని కొమ్మెర, ఆస్నాద గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, డీఈ, ఏఈలు ఆదివారం పర్యటించి వినియోగదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కొమ్మెరలో గట్టు సంపత్‌గౌడ్ అనే వ్యక్తికి వచ్చిన బిల్లును పరిశీలించి న్యాయం చేసేలా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముత్యాల బాపాగౌడ్, సోంకుల స్వామి, ఏలేశ్వరం నరసింహాచారి, లైన్‌మెన్లు తిరుపతయ్య, రమేష్‌రెడ్డి, కలగూర రాజమల్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృత్యు పాశాలు

- వంగిన స్తంభాలు.. వేలాడుతున్న విద్యుత్ తీగలు
- ప్రమాదమని తెలిసినా పట్టించుకోని అధికారులు
- 'పొలం బాట'లో పరిష్కారం కాని వైనం



హాజీపూర్ మండలం ముల్కల్లకు చెందిన గోలివాడ చంద్రయ్య కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 22న గ్రామ శివారులో సాగుచేస్తున్న పొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే తెగిపడిన విద్యుత్ తీగను చూడకుండా తాకడంతో షాక్‌తో శరీరం కాలిపోయింది. గాయాలపాలై ఆసుపత్రిలో చేరాడు. ప్రస్తుతం అతడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. కొద్దిరోజులు వృథాగా ఉన్న విద్యుత్ లైన్‌పై హైఓల్టేజీతో ఉన్న మరో తీగ తెగిపడింది. అధికారులు తీగలను సరిచేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానిక రైతులు ఆరోపించారు.



మంగెనపల్లిలో వంగిన 11కేవీ విద్యుత్ స్తంభం



కన్నెపల్లి మండలంలో పంటచేనులో వంగిన విద్యుత్ స్తంభం



హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులో వంగిన విద్యుత్ స్తంభం

మంచిర్యాలఅగ్రికల్చర్/బెల్లంపల్లి/చెన్నూర్/చెన్నూర్‌రూరల్: విద్యుత్ తీగలు ప్రజల పాలిట మృత్యుపాశాలుగా మారాయి. వంగిన స్తంభాలు.. వేలాడుతున్న విద్యుత్ తీగలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు పోతున్నా.. సమస్యలను విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించడం లేదు. ఈ ఏడాదే ఇప్పటి వరకు ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. మూగ జీవాలు మృత్యువాతపడ్డాయి. ప్రస్తుతం వరికోతలు ఊపందుకున్నాయి. హార్వెస్టర్లతో పంటలు కోస్తున్నారు. దీంతో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని రైతులు, హార్వెస్టర్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్, తదితర సమస్యలు పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పలుచోట్ల అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే మరమ్మతు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహిస్తున్నా, పైపైనే మరమ్మతు చేసి చేతులు దులుపేసుకుంటున్నారని, ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను, తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో 3.54లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో 2.48లక్షల వ్యవసాయ రంగ కనెక్షన్లు ఉన్నాయి.

సమస్యలు..

- లక్సెట్టిపేట మండలంలోని ఇటిక్యాల గ్రామం నుంచి తిమ్మపూర్ వెళ్లే రహదారి మధ్యలో 11 కేవీ విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.
- బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి శివారు ప్రాంతంలో వరి పొలాల్లో కరెంట్ స్తంభం పడిపోయే స్థితిలో ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు.
- తాండూర్‌లో విద్యుత్ తీగలు, స్తంభాల సవరింపు పనులు జరుగుతున్నాయి. రూట్‌ల వారీగా మరమ్మతు పనులు చేస్తున్నారు. కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, చెట్లను నరికి వేయిస్తున్నారు. కిష్టంపేట ఎస్టీ కాలనీలో కొన్ని స్తంభాలు వంగి ఉండగా, రాజీవ్ నగర్‌లో పలు కరెంట్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి.
- వేమనపల్లి మండలంలో ఎక్కడ చూసినా విద్యుత్ తీగలు మృత్యుపాశాలై కనిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని బొగుడ గూడెం, ప్రాణహిత నది వైపు ఉన్న పంట చేలలో.. మంగెనపల్లి సమీప వరి పొలాల్లో.. వేమనపల్లి కొత్త చెరువు ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరిగి మనుషులతో పాటు మూగజీవాలు మృతి చెందుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.
- చెన్నూర్ మండలంలోని ఆస్నాద, ఒత్కులపల్లి, కొమ్మెర, సుందరసాల, దుగ్నెపల్లి, నర్సక్కపేట, పొగెపల్లితో పాటు పలు గ్రామాల్లో పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.
- చెన్నూర్ పట్టణంలోని ఖాబ్రస్తాన్ ఎదుట రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కన ఒకటి ఏర్పాటు చేయగా, మరో ట్రాన్స్‌ఫార్మర్ ఖాబ్రస్తాన్‌లో ఏర్పాటు చేశారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు రెండు మీటర్ల దూరంలో ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తే ఎలా అని ప్రజలు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వాహనదారులు వెళ్లే క్రమంలో ప్రమాదం సంభవిస్తే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో..?

వేలాడుతున్న వైర్లను, వంగిన స్తంభాలను సరి చేయాలి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలను ఇప్పటికైనా అధికారులు సరిచేయాలి.

– మహేందర్, ముల్కల్ల, హాజీపూర్

సమస్యలు పరిష్కరిస్తాం..

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలిస్తాం. సమస్య ఉన్న ప్రాంతంలో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మున్సిపాలిటీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను సరి చేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ల విషయంపై పూర్తిగా అప్రమత్తంగా ఉంటాం. చర్యలు చేపడుతాం.

– శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ, చెన్నూర్

పంటకోతలయ్యాక సవరిస్తాం..

పొలంబాట కార్యక్రమంలో రైతులకు కెపాసిటర్లు అమర్చుకోవాలని, ఆటోస్టార్టర్లు తొలగించాలని, విద్యుత్ ప్రమాదాలపై పలు సూచనలు చేస్తున్నాం. వంగిన, శిథిలావస్థలో ఉన్న స్తంభాల గురించి, వేలాడుతున్న తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు అంశాలను ప్రజలు మా దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం వరి కోత దశలో ఉంది. ఇప్పుడు మరమ్మతు చేస్తే పంట దెబ్బతింటుంది. మరో పదిహేను, ఇరవై రోజుల్లో దిగుబడి వచ్చే అవకాశం ఉంది. తదనంతరం మరమ్మతు చేస్తాం. అత్యంత ప్రమాదకరంగా ఉన్న చోట వెంటనే మరమ్మతు చేపడుతున్నాం.

– ఖైజర్, విద్యుత్ శాఖ డీఈ, మంచిర్యాల



లక్సెట్టిపేట మండలం ఇటిక్యాలలో వంగిన విద్యుత్ స్తంభం



చంద్రవెల్లి శివారు పొలంలో వంగిన విద్యుత్ స్తంభం



చెన్నూర్: ఖాబ్రస్తాన్ ఎదుట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



సుందరసాల సమీపంలో వంగిన విద్యుత్ స్తంభం

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



ఎమ్మెల్యే వినోద్‌కు స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

కాసిపేట: ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. మండలంలోని దేవాపూర్ సల్ఫలవాగులో ఆదివారం ఆదివాసీలు నిర్వహించిన దండారి దర్బార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దశల వారీగా ఆదివాసీలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. దండారీలు, ఆదివాసీలు, ఆదివాసేతరులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్, హెచ్ఆర్ హెడ్ కులకర్ణి, ఆదివాసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే మెరుగైన పాలన

తాండూర్: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మారుమూల పల్లెల్లో సైతం మెరుగైన పాలన అందుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని బోయపల్లి నుంచి గోండుగూడెం మీదుగా బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయం వరకు రూ.2.60కోట్ల నిధులతో మంజూరైన రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ భూమయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండి ఈసా, సింగిల్ విండో వైస్ చైర్మన్ రత్నాకర్ రావు, డైరెక్టర్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్‌కు వినతి

బెల్లంపల్లి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఏఎంసీ ఏరియాలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ శ్రేణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పల్లెలను ప్రగతి పథంలో నడిపిస్తా'

నెన్నెల: మండలాల్లోని పల్లెలను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మన్నెగూడం క్రాస్ రోడ్డు నుంచి కోణంపేట మీదుగా కుశ్నపల్లి వరకు బీటి రోడ్డు, మన్నెగూడం ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య



పి.సంపత్

శ్రీరాంపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఆటోడ్రైవర్..జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సంతోశ్ కథనం.. శ్రీరాంపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆర్కే 6 కాలనీకి చెందిన పెనుగొండ సంపత్ (45) ఆటోడ్రైవర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఈనెల 23న ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబీకులు అతడి కోసం గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదైంది. ఆదివారం ఉదయం కొందరు ఆర్కే 6 గని వెనుకాల చెట్ల పొదల్లో వంట చెరుకు కోసం వెళ్లారు. అక్కడ చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లి పరిశీలించగా సంపత్ అని తేల్చారు. రెండు, మూడు రోజుల క్రితమే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఎస్సై తెలిపారు. భార్య రజిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉంది.

'మంచిభావన' పుస్తక పరిచయం

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి కవయిత్రీ సుమలత రాజేంద్రప్రసాద్ రచించిన తొలి సంపుటి మంచి భావన పుస్తక పరిచయం కార్యక్రమం నిర్వహించారు. ఈ పుస్తకాన్ని రచయితలు రామేశంగౌడ్, శ్రీనాథ్ గౌడ్, సృజనలు పరిచయం చేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు సంతోష్, బ్రహ్మయ్యాచార్య, రజిత, అర్పిత, సుధాంస్ తమ కవితాగానంతో అలరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



గజ్జె పూజలో పాల్గొన్న విద్యార్థులు

నస్పూర్: పట్టణ పరిధిలోని షిర్కే కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో నృత్య విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. శ్రీ శార్వాణి కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆదివారం వేదపండితుల సమక్షంలో గజ్జె పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు డాక్టర్ భార్గవి ప్రేమ్ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళ కూచిపూడి నృత్యంలో ఎక్కువ మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిని రాష్ట్ర జాతీయ స్థాయిలో అవార్డులు సాధించేలా కృషి చేస్తున్నానని తెలిపారు.తాను ఇప్పటి వరకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సుమారు 750 కి పైగా ప్రదర్శనలు ఇచ్చి ఎన్నో అవార్డులు సాధించానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నృత్య సంఘం అధ్యక్షులు రాకం సంతోష్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

- **'నియోజకవర్గ అభివృద్ధి పీఎస్‌ఆర్‌తోనే సాధ్యం'**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతోనే సాధ్యమని మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట రవి అన్నారు. మంచిర్యాలలోని రాళ్లవాగు కరకట్ట నిర్మాణానికి ప్రభుత్వం రూ.255కోట్ల నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఆదివారం ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ముంపు ప్రాంతాల ప్రజలకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్‌ఆర్) పునర్జన్మనిచ్చారని ఆదివారం ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి ఆయన పట్టణ అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. ముంపు ప్రాంతమైన రాంనగర్‌లోని ప్రజలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల, ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముంపు ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

- **బీజేపీ సభ్యత్వ నమోదు**

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లిలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమానికి చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరై సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుంకరి రాజేందర్, నాయకులు మధు, మారుతి, రవిశంకర్ తదితరులు ఉన్నారు.

- **హెచ్‌ఐవీ బాధితులకు మెడికల్ క్యాంప్**

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో ఆదివారం మతృచాయ ఫౌండేషన్, టీ ఆఫ్ లైఫ్ వారి సహకారంతో హెచ్‌ఐవీ బాధితులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉచిత పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేశారు.

- **గంగపుత్ర సంఘం కార్యవర్గం**

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణ గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా వంగళ చక్రపాణి ఎన్నికయ్యారు.

- **బదిలీపై వెళ్తున్న కమిషనర్‌కు సన్మానం**

రామకృష్ణాపూర్: బదిలీపై చెన్నూర్‌కు వెళ్తున్న క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, సూపర్‌వైజర్ వేల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **సమస్య పరిష్కరించుకున్నారు**

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని వాకింగ్ ట్రాక్ పూర్తిగా చెడిపోయింది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆదివారం ఉదయం వాకింగ్‌కు వచ్చిన వారు, ఇతర క్రీడాకారులంతా కలిసి తట్టా, పారాపట్టి వాకింగ్ ట్రాక్‌ను బాగు చేసుకున్నారు.

- **మురళీధర్‌రావుకు నివాళి**

కాసిపేట: ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మిక నాయకుడిగా పనిచేసిన మురళీధర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

- **చీరల పంపిణీ**

జన్నారం: మండలంలోని ధర్మారంలో ఆదివారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు డ్వాక్రా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు.

- **కాంగ్రెస్ నాయకుల హర్షం**

మందమర్రిరూరల్: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా నియమించినందుకు మందమర్రి పట్టణ కాంగ్రెస్ నాయకులు పాత బస్టాండ్ ఏరియాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు.

- **పట్టభద్రుల ఓటరు నమోదు**

మందమర్రిరూరల్: పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఆదివారం పట్టభద్రుల ఓటరు నమోదు నిర్వహించారు. సుమారు 150మంది పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకున్నారు.

- **సీపీఐ నూతన కార్యవర్గం ఎన్నిక**

తాండూర్: సీపీఐ పార్టీ తాండూర్ మండలం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శిగా సాలిగామ సంతోష్, సహాయ కార్యదర్శులుగా నరాల ప్రహ్లాద్, మలిశెట్టి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వాసాల నాగరాజు, కోశాధికారిగా పట్టి శంకర్‌ను ఎన్నుకున్నారు.

- **క్రీడాకారులకు చేయూత**

తాండూర్: క్రీడల్లో అత్యుత్తమంగా రాణించాలని ప్రోత్సాహిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి క్రీడాకారులకు చేయూతను అందించారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17జిల్లా బాలికల కబడ్డీ పోటీల్లో జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థినులకు క్రీడా దుస్తుల కొనుగోలుకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

- **'గంగుల'ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు**

మంచిర్యాలక్రైం: మాతృవియోగం చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ను మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

- **దండారీ ఉత్సవాలు ప్రారంభం**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గిరిజన గ్రామాలైన మొర్రి గూడెం, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గ్రామాల్లో ఆదివారం రాత్రి దండారీ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గోండు తెగకు చెందిన ఆదివాసీలు ఎత్మల్‌సార్–గుమ్మెల దండారీ ఉత్సవాలు చేపడుతుండగా, నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి.

- **'కబ్జా చేస్తే ఊరుకోం'**

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని కేకే–ఓసీ సమీపంలో గల శ్మశానవాటిక కోసం వినియోగించే స్థలాన్ని ఎవరు కబ్జా చేసినా ఊరుకునేది లేదని అంగడిబజార్, యాపల్ ప్రాంత ప్రజలు పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో వనం నర్సయ్య, బోరిగం వెంకటేష్, రాకేష్, గణేశ్, రవికుమార్, శంకర్‌గౌడ్, సా రంగపాణి, సంతోష్ తదితరులు ఉన్నారు.

- **దరఖాస్తుల ఆహ్వానం**

కోటపల్లి: మండలకేంద్రంలోని మోడల్ కళాశాల, పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ గంటల ప్రాతిపదికనా బోధించుటకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29న జిరాక్స్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
చెన్నూర్: సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899